క్లుప్తంగా

అనంతవరంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



అనంతవరం(క్రోసూరు): గ్రామంలో బాలఅభయాంజనేయస్వామి నూతన దేవాలయ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచి కాల్వపల్లి సాంబిరెడ్డి, ఎంపీటీసీ సభవేణుగోపాలరెడ్డి, పట్టిల శ్రీనివాసరావు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి



అచ్చంపేట: యూటీఎఫ్ జిల్లా మహాసభలు ఈనెల 26న గురజాలలో నిర్వహించనున్నట్లు సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో శనివారం మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి



పెదకూరపాడు: లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం ఉషశ్రీ అన్నారు. పెదకూరపాడు గ్రామంలో మహిళలపై హింస నిర్మూలన సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళల వేధింపులను అడ్డుకోవాలంటే ముందు మనమే మారాలన్నారు. మహిళలను గౌరవించే సమాజం మారాలన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, శ్రీనిధి ఏజీఎం చిన్నబుల్లయ్య పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ ఆమోద దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని చెప్పారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు మేలు



అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా గ్రామాలలో ఉన్న నిరుపేదలకు ఆరోగ్య ప్రయోజనాలు సమకూరతాయని ఈఓపీఆర్డీ పి.వీర్రాజు తెలిపారు. ఐటిసి బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ సంస్థ కో ఆర్డినేటర్ కృష్ణ, ఎంపిడివో సూపరింటెండెంట్ అంబటి రమేష్‌బాబు, క్లాప్ మిత్రాలు, సెర్ప్ సంస్థ ప్రతినిధులు బొల్లయ్య, సతీష్ పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

కారెంపూడి: వివిధ కేసులలో పట్టుబడిన వాహనాల వేలం సోమవారం నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఎం.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన మోడల్, దాని కండెషన్ ప్రకారం ఆర్టీఓ నిర్ణయించిన ధరకు జీఎస్టీ కలపి వాటి ధరగా నిర్ణయించి వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాడిన మొత్తాన్ని ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు.

మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మృతి

దాచేపల్లి: నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, నడికుడికి చెందిన నాళం సుజాత(45) శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భౌతిక కాయాన్ని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా, మాజీ సర్పంచులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్ సందర్శించి, నివాళులర్పించారు. ఆమె భర్త శ్రీనివాసరావుని పరామర్శించారు.

మాట నిలబెట్టుకునే సీఎం వైఎస్ జగన్

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



బొల్లవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

బొల్లవరం(ముప్పాళ్ల): ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆదరించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కోరారు. మండలంలోని బొల్లవరం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ లబ్ధిని వివరించే డిస్‌ప్లే బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను మంత్రి అంబటి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోని లేని విధంగా సంక్షేమ పథకాలు ఈ రాష్ట్రంలో అమలవుతున్నాయని వివరించారు. 11 వందల ఓట్లు ఉన్న ఈ చిన్న గ్రామానికి మొత్తం రూ.10.75 కోట్ల లబ్ధి ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో జరిగిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మీకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా చెప్పిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సరికొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించిన ఘనత ఆయనదేనని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేశారు కాబట్టే ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్ కావాలని అని ధైర్యంగా చెబుతున్నామని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాలు రద్దు అని చెప్పి మోసం చేసిన చంద్రబాబునాయుడుకు ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని నిలదీశారు. ఆరు మాసాల్లో ఎన్నికలు రాబోతున్నాయి, వైఎస్ జగన్‌ను మరలా ఎన్నుకోవాలని కోరారు.

పవన్‌కళ్యాణ్‌కు ఓటు వేసే వారు ఆలోచించుకోవాలి....

కాపులు పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుంటే, పవన్ మాత్రం చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. అలాంటి పవన్‌కళ్యాణ్‌కు ఓటు వేసే వారు ఒక్కసారి ఆలోచించుకోవాలని అన్నారు. పవన్‌కళ్యాణ్ కు ధైర్యం ఉంటే అన్ని స్థానాల్లో పోటీ చేయాలి, చంద్రబాబును అధికారంలోకి తీసుకురావలనే ఉద్దేశంతోనే పవన్ కళ్యాణ్ రాజకీయాలు చేస్తున్నాడు తప్ప నిజమైన రాజకీయలక్షణాలు లేవన్నారు. పవన్‌కళ్యాణ్ మద్దతు తెలిపే చంద్రబాబుకు ఓటు వేసేందుకు కాపులు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. అనంతరం గ్రామంలోని కళ్లం కృష్ణారెడ్డి గృహంలో బస చేశారు. కార్యక్రమంలో సర్పంచి బద్దిగం పూజితా రెడ్డి, ఎంపీటీసీ కళ్లం వీరభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, ముప్పాళ్ల సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బద్దిగం వెంకటరెడ్డి, ఈపూరి వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, కారుమూరి కృష్ణారెడ్డి, చింతపల్లి రవి, బ్రహ్మారెడ్డి, అన్నపురెడ్డి రంగమోహనరెడ్డి, చల్లా శివారెడ్డి సచివాలయ కన్వీనర్లు వీరారెడ్డి, శంకర రెడ్డి పాల్గొన్నారు.



కోటనెమలిపురిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరెడ్డి



కాశిపాడులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మీరయ్య

అర్హులకే సంక్షేమ పథకాలు..

రాజుపాలెం: అర్హులకే నేరుగా సంక్షేమ పథకాల అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోటనెమలిపురి రామాలయం వద్ద మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి పథకాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే యర్రం మాట్లాడుతూ మీ గ్రామంలో సంక్షేమం, అభివృద్ధికి జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.30 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకు, అగ్రవర్ణాలలోని పేదవారికి కూడా సంక్షేమ ఫలాలు జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే అందుతున్నాయని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి ఇప్పుడు వైఎస్సార్ ప్రభుత్వానికి తేడా తెలుసుకుని జగనన్నకు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబుకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ దేవిరెడ్డి లచ్చిరెడ్డి, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ లాల్ బాషా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బూదాటి సీతారాములు పాల్గొన్నారు.

కాశిపాడులో..

పెదకూరపాడు: మండల పరిధిలోని కాశిపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కాశిపాడు సచివాలయం పరిధిలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల బోర్డును ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షరీఫ్, సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించి వారి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లెల సుధాకర్, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

నకరికల్లు: సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులకు చేర్చడంలో పారదర్శకత వహించడం వల్లే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు అన్నారు. మండలంలోని కుంకలగుంటలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచి సుంకర మరియమ్మ, ఎంపీటీసీలు బాపతు శ్రీనివాసరెడ్డి, వర్ల మరియమ్మ, రుసుం హనుమంతరావు, అవుదూరి అంజిరెడ్డి, మద్దాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నాగసాయి మహేశ్వరి ఎంపిక



నాగసాయి మహేశ్వరిని అభినందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 13వ వార్డుకు చెందిన తిరునవల్లి నాగసాయి మహేశ్వరి ఎంపికైంది. నాగసాయి మహేశ్వరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఫుట్‌బాల్ క్లబ్‌లో శిక్షణ పొందుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నాగసాయి మహేశ్వరి ని శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అభినందించారు. విద్యలోనూ, క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థితికి ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు, ఫుట్‌బాల్ కోచ్ పాలపర్తి సురేష్, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ, గంప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాంతియుతంగా జీవనం సాగించాలి

కారంపూడి సీఐ జయకుమార్

దుర్గి: ప్రజలు శాంతియుతంగా జీవించాలని కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దారా జయకుమార్ పేర్కొన్నారు. పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి ధర్మవరం గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జూదం పేకాట, కోడి పందేలు, తెలంగాణ మద్యం విక్రయం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని గ్రామస్తులను కోరారు. ప్రతి ఒక్కరూ శాంతి వాతావరణానికి సహకరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపాలని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తమకు సమాచారాన్ని అందించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

రాజ్యాంగ పీఠికపై అవగాహన పెంచుకోవాలి

దాచేపల్లి: రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీఐ సురేంద్రబాబు అన్నారు. మండలంలోని కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ భారత రాజ్యాంగ పీఠిక అమలు తీరుపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి ఒక్కరికి జీవించే హక్కును కల్పించిందని, రాజ్యాంగంలోని పొందుపర్చిన సమానత్వపు హక్కు, స్వాతంత్ర్య హక్కు, దోపిడీ నిరోధించే హక్కు, మత స్వాతంత్ర్య హక్కు, సాంస్కృతిక, విద్య హక్కు తదితర హక్కులను కల్పించిందన్నారు.

ఓటర్లు ఎవరూ ఆందోళన చెందవద్దు

ఆర్డీఓ రమాకాంత్ రెడ్డి



గురజాల: ఓటర్లు కొంత మందికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేయడం జరిగిందని ఓటర్లు ఎవరైన ఆందోళన చెందవద్దని రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్ రెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు ఓటర్ జాబితాలో రెండు కేటగిరిల్లో కొన్ని ఓట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండటం, అదే విధంగా ఒక వ్యక్తికి ఒక ఓటు అతడి ఫొటోకు బదులు మరొక ఫొటో ఉండడం వంటి వాటిని గుర్తించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఒక వ్యక్తికి మరొక చోట ఓటు ఉన్నట్లు 599 ఓట్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఫొటోలు మార్పు, ఒక వ్యక్తి ఫొటోకు బదులు మరొక ఫొటో వంటివి 1267 ఓట్లు ఉన్నట్లు నిర్ధారించినట్లు వివరించారు. అటువంటి వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫార్మాట్–ఏతో పాటు కన్‌ఫర్మేషన్ లెటర్‌లను రెవెన్యూ అధికారులు పంపించడం జరిగిందన్నారు. లెటర్‌లు వచ్చిన వారు ఎవరూ కూడా అధైర్యపడవద్దని మీ ఓట్లు తీసివేయడం జరగదన్నారు. రెండు ఓట్లు ఉన్న వారు వెంటనే ఆ ఫార్మట్‌లో గుర్తించిన తరువాతే వారి అనుమతి ఉంటేనే మరొక ఓటును తొలగించనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు ముఖ్యంగా ఫారం–8ను ఒక్కసారి మాత్రమే పెట్టుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అడ్రసు మార్పు, ఫొటో మార్పు, ఇంటి నంబరు మార్పు వంటివి ఒక్కసారి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ మీసాల దానియేలు ఉన్నారు.

దైదలో ఎకో పార్కు ఏర్పాటు చేస్తాం

జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు



దైద అమరలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద పరిశీలిస్తున్న జిల్లా ఫారెస్టు అధికారి

గురజాల: మండల పరిధిలోని దైదలో అమరలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఎకో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు అన్నారు. దైదలోని దేవాలయాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాచర్లలోని నగర వనం, దుర్గి మండలంలోని మించాలంపాడులో ఉన్న అటవీ శాఖ రహదారిని తనిఖీ చేశారు. మాచర్లలోని నగరవనంలో పలు మొక్కలు, బాలల పార్కు, నడకదారి, ఓపెన్ జిమ్, యోగా సెంటర్, వాకింగ్ ట్రాక్, సాహస క్రీడా ప్రదేశం వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా దుర్గి మండలంలోని మించాలంపాడు రహదారి ఏర్పాటుకు పంచాయతీ రాజ్ శాఖ వారు అటవీ సంరక్షణ చట్టం 1980కి అనుగుణంగా అటవీ ప్రాంతంలో 1.5 కిలోమీటర్లు తారు రోడ్డుకు ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. దైద, మాచర్ల అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా దాతల సహకారంతో పాటు ఆలయ కమిటీ సభ్యుల సహకారం ఉండాలన్నారు. విశ్రాంతి భవనాలు, పగోడాలు, ధ్యాన మందిరం, బాత్‌రూమ్‌లు, పచ్చదనంపై అభివృద్ధి వంటివి దాతల సహకారం ఉండాలన్నారు. దేవాలయం అభివృద్ధి గురించి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్, మాచర్ల, గురజాల ఫారెస్టు బీట్ ఆఫీసర్‌లు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

పిడుగురాళ్ల: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కార్డ్ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లోని కార్డ్స్ సంస్థ పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో భిన్నత్వంలో ఏకత్వం ఉండేటట్లు అందరూ ఆమోద యోగ్యంగా ఉండే రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకులు గడ్డం శామ్యూల్, దయామని, సునీత, అబ్దుల్ రహీం, పాఠశాల హెచ్‌ఎం పి.లత పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మాచర్ల: పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం నిర్వహించారు. 31వ వార్డు కందుకూరి రత్నరాజు ఆధ్వర్యంలో, 20వ వార్డులో జాన్ వెస్లి, బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాస్టర్ డేవిడ్, విజయ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపి క్రైస్తవులకు ఆశీస్సులందించారు. అంబేడ్కర్ సెంటర్ ప్రాంతంలో ఆంధ్రా ఇవాంజిలికల్ చర్చిలో తెల్లవారుజామున నుంచి చాట్ల ఐజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన చేశారు. హైదరాబాద్‌కు చెందిన బేతేలు మందిర నిర్వాహకులు పాల్ డేవిడ్, జాన్ వెస్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

9న బైబిల్ క్విజ్ పోటీలు

పట్టణంలో క్రిస్మస్ నేపథ్యంలో మెగా బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ బ్రహ్మనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 9న నెహ్రూనగర్‌లోని సమర్పణ మందిరంలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి బహుమతిగా రూ.15,000, రెండో బహుమతిగా రూ.10,000, మూడో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9848343195, 6362218163లో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులు సమన్వయంతో చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ

నకరికల్లు: ప్రభుత్వ పథకాలు అర్హులందరికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మేచారపు అనూరాధ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. తహసీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ నర్సింగపాడు, త్రిపురాపురం, చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో దఫాలవారీగా చేపడతామని తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రక్రియ జరుతుందని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పంచాయతీ రాజ్ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఏపీఎం సునీత, ఏఓ కె.దేవదాసు, పశుసంవర్ధక శాఖ ఏడీఏ వెంకటేశ్వర్లు నాయక్, ఏపీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మండల సమాఖ్య సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

నకరికల్లు: మహిళలను గౌరవించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నూతన చైతన్యం మార్పు కోసం చొరవ, మండల సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఏపీఎం సునీత మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులను సమానం చూడాలన్నారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టం శిక్షిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దిశ చట్టాన్ని అమలు చేస్తుందని అన్నారు. బాలికలను చదివిస్తే కుటుంబం ఉన్నత స్థాయికి చేరుకుంటుందని అన్నారు. మహిళలు, పురుషులు వేరువేరుగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనూరాధ, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, ఎంపీటీసీ సభ్యురాలు బైరెడ్డి ధనలక్ష్మి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్ హుస్సేన్, సీసీ కనకారావు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదంలో ఏజెన్సీ నుంచి నష్టపరిహారం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పిల్లి యజ్ఞనారాయణ

సత్తెనపల్లి: గ్యాస్ ప్రమాదం జరిగితే ఏజెన్సీ ద్వారా నష్టపరిహారం పొందే వీలుందని అందుకు గ్యాస్ డెలివరి అడ్రస్‌లోనే బాధితుడు నివాసం ఉండాలని పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం(ఏంజెల్ ఫ్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్) ప్రెసిడెంట్ పిల్లి యజ్ఞనారాయణ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే రూ.6 లక్షలు, ఆస్తి నష్టానికి రూ. 2 లక్షల వరకూ నష్టపరిహారం గ్యాస్ ఏజెన్సీ నుంచి పొందవచ్చన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే వినియోగదారుల రక్షణ చట్టం పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సంస్థ జిల్లా మహిళ ప్రెసిడెంట్ పి.సౌజన్య మాట్లాడుతూ పెట్రోల్ బంకులలో మనకి ఉచితంగా మరుగు దొడ్లను వాడుకొనే హక్కు ఉందని, మంచి నీటి సదుపాయం కల్పించాలని, అలాగే దగ్గరలో ఏదైనా ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ కిట్ సదుపాయం కల్పించాలన్నారు. సంస్థ జాయింట్ సెక్రెటరి షేక్ షముల్లా మాట్లాడారు. అవగాహన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సత్తెనపల్లి ప్రెసిడెంట్ టి.వెంకటేష్, సత్తెనపల్లి సెక్రెటరీ షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

క్రిస్మస్ కాలాన్ని ఆహ్వానిస్తూ ప్రార్థనలు



కొవ్వొత్తుల వెలుతురులో ప్రార్థనలు

క్రోసూరు: స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో క్రిస్మస్ కాలన్ని ఆహ్వానిస్తూ శుక్రవారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు చర్చి పాస్టర్ రెవ.డాక్టర్ సుందరరావు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 25న నిర్వహించే క్రిస్మస్ పండుగను ఉద్దేశించి నెలరోజుల ముందుగా ప్రార్థనలు నిర్వహించటం జరుగుతుందని పాస్టర్ తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ బిషప్ సూర్యప్రకాశ్ వాక్యసందేశాన్ని అందించారు.

ఆరోగ్యబీమాపై క్లాప్ మిత్రలకు అవగాహన

క్రోసూరు: ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై అవగాహన కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.శివరామయ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ద్వారా గ్రామాల్లో ఉన్న పేదలకు ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందన్నారు. సెర్ప్ సంస్థ కోఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకాల ప్రయోజనాలను వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందటంతో పాటు ప్రతి ఒక్కరూ పొదుపు చేసుకోవటం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని క్లాప్‌మిత్రలు, సెర్ప్ సంస్థ ప్రతినిధులు బొల్లయ్య, సతీష్ పాల్గొన్నారు.

నేడు శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో జ్వాలాతోరణం



రంగుల ముగ్గుతో వేస్తున్న శివలింగాకారం

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఆదివారం కార్తిక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్యం ధర్మకర్త, మఠాధిపతులు పూజ్య లలితాంబ మాతాజీ శుక్రవారం తెలిపారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఐదు గంటల నుంచి లక్ష దీపోత్సవం, స్వామి వారి పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. రాత్రికి శివ భజన, దీక్ష ధరించిన స్వాములు అందరికీ బిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆశ్రమాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆశ్రమం వద్ద రంగుల ముగ్గుతో శివలింగాకారం వేశారు.